సాక్షి మహబూబ్‌నగర్
సోమవారం, 13, అక్టోబర్, 2025

నెట్‌బాల్ విజేత పాలమూరు

- ట్రెడిషనల్, ఫాస్ట్‌-5లో జిల్లా బాలుర జట్ల హవా
- రెండు విభాగాల్లో విజేతగా నిలిచిన జట్లు
- రన్నరప్‌గా నారాయణపేట బాలురు



- ముగిసిన రాష్ట్రస్థాయి చాంపియన్స్ ట్రోఫీ

– మహబూబ్‌నగర్ క్రీడలు

-వివరాలు 8లో..

గరిష్టం/కనిష్టం
33.2 /18.1

వాతావరణం
మధ్యాహ్నం ఎండ తీవ్రత కాస్త కనిపిస్తుంది. రాత్రిళ్లు చలిగా ఉంటుంది. ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

అర్ధరాత్రి ఎస్పీ ఆకస్మిక తనిఖీలు



మహబూబ్‌నగర్ క్రైం: కొత్త వ్యక్తులు, అనుమానాస్పదంగా ఎవరైనా వ్యక్తులు తిరుగుతున్న డయల్ 100 లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్పీ డి.జానకి అన్నారు. జిల్లాకేంద్రంలో రాత్రివేళ దొంగతనాలు జరుగుతున్న క్రమంలో ఎస్పీ శనివారం అర్ధరాత్రి 12 గంటల నుంచి ఆదివారం తెల్లవారుజామున విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. నగరంలోని రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు, అనుమానస్పద వ్యక్తులను, పిస్తాహౌజ్ చౌరస్తా, న్యూటౌన్, బస్టాండ్ ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ చేయడంతోపాటు ఆ సమయంలో రోడ్లపై తిరుగుతున్న వ్యక్తుల వివరాలు ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతలు కాపాడటమే పోలీసుల లక్ష్యం అని, ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారన్నారు. రాత్రివేళ పెట్రోలింగ్ పెంచుతున్నట్లు చెప్పారు. తనిఖీల్లో డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, రూరల్ సీఐ గాంధీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ తప్పక తీసుకోవాలి

దీపావళి పండగ నేపథ్యంలో ప్రత్యేకంగా హోల్‌సేల్‌తోపాటు ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసి బాణాసంచా విక్రయాలు జరిపే వ్యాపారులు తప్పకుండా నిబంధనలు పాటించాలని, లైసెన్స్ తీసుకోవాలని ఎస్పీ జానకి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టపాసుల దుకాణాలు రద్దీ ప్రదేశాలు, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, పెట్రోల్ బంకుల సమీపంలో కాకుండా.. జిల్లా అగ్నిమాపక అధికారులు సూచించిన ప్రాంతంలో మాత్రమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైనా నిబంధనలు పాటించకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధానంగా తల్లిదండ్రుల పర్యవేక్షణలోనే పిల్లలు టపాసులు కాల్చేలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

వార్డెన్‌పై సస్పెన్షన్ వేటు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నవాబుపేట మండలంలోని ఎన్మన్‌గండ్ల హాస్టల్ వార్డెన్ పై సస్పెన్షన్ వేటు వేసినట్లు బీసీ సంక్షేమ శాఖాధికారి ఇందిర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్మన్‌గండ్లలోని బాలికల హాస్టల్‌ను శనివారం కలెక్టర్ విజయేందిర తనిఖీ చేసిన సందర్భంలో విద్యార్థులకు భోజనంలో కూరగాయలు వడ్డించకుండా కేవలం సాంబార్ మాత్రమే వడ్డించడం, వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ చర్యలకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే హాస్టల్ వార్డెన్‌పై సస్పెన్షన్ వేటు వేసినట్లు ఆమె పేర్కొన్నారు. అలాగే ఆదివారం జిల్లాకేంద్రంలోని మెట్టుగడ్డ ఎస్టీ హాస్టల్, వెంకటేశ్వరకాలనీలోని ఎస్సీ హాస్టల్‌ను అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు వడ్డించే చట్నీలో నాణ్యత లేకపోవడంతో సంబంధిత హాస్టల్ వార్డెన్‌కు మెమోలు జారీ చేశారు.

‘చేయి’ తడపాల్సిందే!

ఇసుక కాంట్రాక్టర్‌కు ‘అధికార’ పార్టీ నేత హుకుం



నిలిచిపోయిన ఇందిరమ్మ ఇసుక వాహనాల దగ్గర నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

- ఒక్కో టిప్పర్‌కు రూ.6 వేల చొప్పున డిమాండ్
- పట్టించుకోకపోవడంతో రోడ్లు దెబ్బతింటున్నాయంటూ అడ్డంకులు
- తుమ్మిళ్లలో 2 రోజులుగా నిలిచిన ఇసుక రవాణా
- ఆందోళనలో లబ్ధిదారులు.. సీఎం పేషీకి చేరిన ‘పంచాయితీ’

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఇసుక కొరత గుదిబండగా మారింది. ఈ విషయాన్ని గ్రహించిన సర్కారు తొలుత జోగుళాంబ గద్వాల, ఆ తర్వాత ఉమ్మడి పాలమూరులోని మిగతా జిల్లాల్లో ఇందిరమ్మ ఇళ్లకు తుమ్మిళ్ల నుంచి ఉచితంగా ఇసుక అందజేసేలా కార్యాచరణ చేపట్టింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఫలితం కానరావడం లేదు. నదిలో నీటి ప్రవాహం బాగా ఉంది.. అందుకే అధికారిక రీచ్‌లోనూ ఇసుక తవ్వకాలు చేపట్టలేకపోతున్నారని అనుకుంటే పొరపాటే. తొలుత వర్షాలతో.. తాజాగా ‘చేయి’ తడపాల్సిందేనంటూ అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి హుకుంతో ఇసుక తవ్వకాలు, రవాణా నిలిచిపోయింది. ఫలితంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది.

అడుగడుగునా అడ్డంకులు..

జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గ పరిధిలోని రాజోళి మండలం తుమ్మిళ్లలో తుంగభద్ర నది నుంచి ఫ్లెడ్జింగ్ పద్ధతిన ఇసుక తోడి ‘మన ఇసుక వాహనం’ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా అందజేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు నదిలో నీరు ఉన్న సమయంలోనూ కార్గో శాండ్ బోట్స్ డ్రెజింగ్ మెకానిజం పద్ధతిన ఇసుక తవ్వేలా ఈ ఏడాది జూన్‌లో టెండర్లు నిర్వహించింది. మూడు పాయింట్ల ద్వారా వచ్చే ఏడాది జూన్ 21 వరకు 7.25 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక తీసేందుకు ఓ కాంట్రాక్టర్ ఒప్పందం కుదుర్చుకొని జూలై 3న తవ్వకాలు ప్రారంభించారు. లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న మేరకు.. అధికారులు సూచించిన రూట్ మ్యాప్ ప్రకారం తుమ్మిళ్ల నుంచే టిప్పర్ల ద్వారా ఇసుక రవాణా చేస్తున్నారు. అయితే తొలి నుంచీ అడ్డంకులు ఎదురవుతూనే ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో సుమారు 7 వేల ఇళ్లకు ఇసుక అందించాల్సి ఉంది. 45 రోజుల క్రితం సరఫరా మొదలైనప్పటికీ.. ఇప్పటి వరకు 650 ఇళ్లకు మాత్రమే అందజేశారు. వర్షాలతో సరఫరాకు అడ్డంకులు ఏర్పడగా.. దాన్ని అధిగమించేలోపు మరోసారి బ్రేక్ పడింది.

డ్రైవర్ల ఆందోళన..

ఇసుక లోడ్‌తో వాహనాలు నిలిచిపోగా టైర్లు దెబ్బతింటున్నాయని.. రెండు రోజులుగా తిండి, నీరు లేక ఇబ్బంది పడుతున్నామంటూ డ్రైవర్లు ఆదివారం ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో కొందరు యువకులు రీచ్ వద్దకు చేరుకుని గతంలో ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు ఇసుకను కొల్లగొట్టారని ఉదహరించారు. అప్పుడు ఈ నాయకులు ఎక్కడికి వెళ్లారని.. అప్పుడు దెబ్బతిన్న రోడ్లు ఇప్పటిదాకా వేయకపోతే ఎందుకు ప్రశ్నించడం లేదని ధ్వజమెత్తారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక అందిస్తే మంచిదేనని.. మాకు ఎలాంటి అభ్యంతరాలు లేవని తెలిపారు. అనుమతులు ఉన్నా.. అధికార పార్టీ నాయకులు వారి స్వార్థం కోసం అడ్డుకుంటూ గ్రామం పేరు చెడగొడుతున్నారంటూ వాహనాలను పంపించారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో వీడియోలు వైరల్‌గా మారగా.. ‘అధికార’ నేత నిర్వాకం చర్చనీయాంశమైంది.

ఇవ్వాల్సిందే.. లేదంటే నడవనివ్వం

‘ఇందిరమ్మ ఇంటికైనా.. ఇతర అవసరాలకైనా.. ఏదైనా సరే.. పర్సంటేజీ ఇవ్వాల్సిందే.. ఒక్కో టిప్పర్‌కు రూ.6 వేలు చెల్లించాల్సిందే’నని అలంపూర్ నియోజకవర్గానికి చెందిన ఓ ‘అధికార’ నేత తేల్చిచెప్పడంతో ఇసుక తవ్వకాలు, రవాణాకు బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం తుమ్మిళ్ల రీచ్ వద్దకు అధికార పార్టీకి చెందిన పలువురు నాయకులు వెళ్లి వాహనాలను అడ్డుకున్నారు. తమ గ్రామంలో రోడ్లు దెబ్బతింటున్నాయంటూ వాహనాలను నిలిపివేశారు. ఈ క్రమంలో నియోజకవర్గ ముఖ్య నేత నుంచి పర్సంటేజీ ఇవ్వని పక్షంలో ఒక్క వాహనాన్ని కూడా తిరగనిచ్చేది లేదంటూ సదరు కాంట్రాక్టర్‌కు వార్నింగ్ వచ్చినట్లు సమాచారం.

అసలు వస్తదో.. రాదో..



మొదటి విడతలో భాగంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేస్తే.. రావడానికి నెల రోజులు పట్టింది. దీంతో నిర్మాణం నెమ్మదిగా సాగింది. తుమ్మిళ్ల రీచ్ పక్కనే ఉన్నా.. చాలా రోజులు ఎదురు చూడాల్సి వచ్చింది. ఏవేవో సాకులు చెబుతున్నారు. రాజకీయ కారణాలతోనే ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రెండో దశలో ఇసుక కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. అసలు వస్తదో.. రాదో, వస్తే.. ఎప్పుడొస్తదో.. తెలియని పరిస్థితి ఉంది. దీంతో ఏం చేయాలో తోచడం లేదు.

– సోమేష్, రాజోళి

ఉన్నతాధికారులకు ఫిర్యాదు..

నియోజకవర్గానికి చెందిన అధికార పార్టీ నేత డిమాండ్‌కు అంగీకరించని సదరు కాంట్రాక్టర్ నేరుగా ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో సీఎం పేషీకి పంచాయితీ చేరగా.. సీఎంఓ వర్గాలు ఆరా తీసినట్లు తెలుస్తోంది. పలువురు జిల్లా అధికారులతో ఫోన్‌లో సమాచారం సేకరించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అయితే దీనిపై జిల్లా అధికారులెవరూ నోరు విప్పడం లేదు.

డీసీసీ అధ్యక్షుల ఎంపికపై అభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ ఎం.నారాయణస్వామి

స్టేషన్ మహబూబ్‌నగర్: డీసీసీ అధ్యక్షుడి ఎంపికలో జిల్లా కాంగ్రెస్, బ్లాక్, మండల స్థాయిలో కార్యకర్తల అభిప్రాయ సేకరణ ఉంటుందని ఏఐసీసీ పరిశీలకుడు, కర్ణాటకకు చెందిన ఎమ్మెల్సీ ఎం.నారాయణస్వామి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, శ్రీగణేష్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం ద్వారా కాంగ్రెస్ నాయకులు, పార్టీ ప్రతినిధుల అభిప్రాయాలతో డీసీసీ అధ్యక్షుడి నియామకంపై ఏఐసీసీ నేతృత్వంలో టీపీసీసీ ఆధ్వర్యంలో తుది నిర్ణయం ఉంటుందన్నారు. మహబూబ్‌నగర్, నారాయణపేట డీసీసీ అధ్యక్షుల ఎంపిక కోసం తనకు ఏఐసీసీ పరిశీలకుడిగా నియామకం చేశారన్నారు. డీసీసీ అధ్యక్ష పదవికి ఆరుగురు అభ్యర్థులు పోటీ చేయవచ్చని, ఆశావాహులు ఈ నెల 20 వరకు దరఖాస్తుఫారాలు అందజేయాలని కోరారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ నెల 16, 17, 18 తేదీల్లో అభిప్రాయాలు సేకరిస్తామని, 22లోగా నివేదికను ఏఐసీసీకి సమర్పిస్తామని చెప్పారు. జిల్లాస్థాయిలో వ్యక్తిగతంగా, గ్రూపులుగా అభిప్రాయాలు సేకరణ ఉంటుందన్నారు. పార్టీకి కష్టపడి పనిచేసిన వారికి తప్పకుండా పదవులు లభిస్తాయన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు, వివిధ చైర్మన్లు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించగా.. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని డీసీసీ అధ్యక్షుడి నియామకంపై ఏఐసీసీ తుది నిర్ణయం తీసుకుంటుందని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నట్లు తెలిసింది. సమావేశంలో టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, పీసీసీ పరిశీలకులు మెట్టు సాయికుమార్, ఉజ్మా షాకీర్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, నాయకులు సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, హర్షవర్ధన్‌రెడ్డి, మన్నె జీవన్‌రెడ్డి, జహీర్ అఖ్తర్, వసంత, సిరాజ్‌ఖాద్రీ, సీజే బెనహర్, అజ్మత్ అలీ, అవేజ్ తదితరులు పాల్గొన్నారు.


కులాలను పరిగణలోకి తీసుకోవాలి

జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ముగ్గురం రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారమేనని, ప్రభుత్వం కూడా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై చిత్తశుద్ధితో పోరాడుతుందని, ఈ నేపథ్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల్లో సమర్థవంతమైన నాయకులను డీసీసీ అధ్యక్షుడిగా పరిగణలోకి తీసుకోవాలని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తన అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

పరిశోధనలకు పట్టం

పలు అంశాలపై పరిశోధనలు చేసిన పీయూ రీసెర్చ్ స్కాలర్స్

- స్నాతకోత్సవంలో 12 మందికి డాక్టరేట్లు
- పీయూ చరిత్రలో మొట్టమొదటిసారి మన్నె సత్యనారాయణరెడ్డికి గౌరవ డాక్టరేట్ ప్రదానం
- గవర్నర్ రాక నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు



విద్యార్థులకు ఉన్నత విద్య అందించడం కోసం ఏర్పాటైన పాలమూరు యూనివర్సిటీ (పీయూ) సకల సౌకర్యాలతో అన్ని హంగులు అద్దుకుంటోంది. అన్ని డిపార్ట్‌మెంట్లలో నాణ్యమైన విద్య అందిస్తూ.. మరోవైపు పరిశోధనలకు ప్రాధాన్యమిచ్చి ఎంతోమంది యువత భవితకు బంగారు బాటలు వేస్తుంది. ఈ యూనివర్సిటీలో అంచెలంచెలుగా వివిధ కోర్సులు అందుబాటులోకి తీసుకురాగా.. పీహెచ్‌డీలకు కేంద్రంగా మారింది. ఈ క్రమంలోనే ఈ నెల 16న నిర్వహించనున్న పీయూ నాలుగో స్నాతకోత్సవంలో ఏకంగా 12 మంది పీహెచ్‌డీ పట్టా పొందనుండడం గమనార్హం.

– మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్



మరో 4 రోజులు.

పీయూ 4వ స్నాతకోత్సవాన్ని నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 16న జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చాన్స్‌లర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరుకానున్న నేపథ్యంలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ క్రమంలో యూజీ, పీజీ విద్యార్థులతోపాటు పీహెచ్‌డీ పూర్తి చేసిన 12 మంది రీసెర్చ్ స్కాలర్స్‌కు కూడా డాక్టరేట్ ప్రదానం చేయనున్నారు. ఇంత ఎక్కువ సంఖ్యలో పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి పట్టాలు ప్రదానం చేయడం ఇదే మొదటిసారి. ఇందులో ఎక్కువగా మైక్రోబయోలజీ విభాగంలో 5, కెమిస్ట్రీ విభాగంలో 5, కామర్స్ విభాగంలో 1, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఒకరు ఉన్నారు. ఈ క్రమంలో సంబంధిత డిపార్ట్‌మెంట్లలో ఎక్కువ మంది రెగ్యులర్ అధ్యాపకులు ఉండడంతో ఎక్కువ రీసెర్చ్ పేపర్లు వెలువడ్డాయి. దీంతో స్కాలర్స్‌కు డాక్టరేట్ ప్రదానం చేయనున్నారు.

‘మన్నె’కు గౌరవ డాక్టరేట్..

పీయూలో ఇప్పటి వరకు మొత్తం మూడు సార్లు స్నాతకోత్సవం నిర్వహించగా.. నాలుగోసారి జరిగే కార్యక్రమంలో మొట్టమొదటిసారి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా ఓ రంగంలో విశేష కృషి చేసిన వారికి మాత్రమే ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేసేందుకు ఆస్కారం ఉంటుంది. ఈ క్రమంలో ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్ అధినేత మన్నె సత్యనారాయణరెడ్డికి మొదటిసారి గౌరవ డాక్టరేట్ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆయన పాలమూరు జిల్లా వాసి కావడం, రాష్ట్రంలో పలు ఫార్మాతోపాటు ఇతర కంపెనీలు ఏర్పాటు చేసి యువతకు పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న నేపథ్యంలో ఆయనకు గౌరవ డాక్టరేట్ ఇచ్చేందుకు అధికారులు నిర్ణయించారు. స్నాతకోత్సవంలో గవర్నర్ చేతులమీదుగా పీహెచ్‌డీ పూర్తి చేసిన 12 మంది రీసెర్చ్ స్కాలర్స్ డాక్టరేట్.. మన్నె సత్యనారాయణరెడ్డి గౌరవ డాక్టరేట్ అందుకోనున్నారు.

పీహెచ్‌డీ పట్టా పొందనున్న వారి వివరాలిలా..

స్కాలర్: రాజశ్రీనాథ్ (మైక్రోబయాలజీ)
పరిశోధన అంశం: స్టడీ ఆన్ మైక్రోబియాల్ లిపస్ అండ్ ప్రొటెస్ కల్టివబుల్ అండ్ మెటాజినీవబుల్ అప్రోచ్

స్కాలర్: శ్రీనివాసరావు మేకల (మైక్రోబయాలజీ)
పరిశోధన అంశం: అల్లివేషన్ ఆఫ్ డ్రౌట్ స్ట్రెస్ ఇన్ క్యాప్సియం అనమ్ ఎల్.అండ్ సొఫోసిస్ టెట్రాగోనాలోబా బై యూసింగ్ ప్లాంట్ గ్రోత్ ప్రమోటింగ్ బ్యాక్టీరియా

స్కాలర్: విజయ్‌కుమార్ (మైక్రోబయాలజీ)
పరిశోధన అంశం: బయోరిమేడేషన్ స్టడీస్ అన్ ఫిజికో-కెమికల్ అన్ మైక్రోబయాలాజికల్ అలాలసిస్ ఆఫ్ వాటర్ ఫర్ రీస్టోరేషన్ ఆఫ్ పెద్ద చెరువు, మహబూబ్‌నగర్

స్కాలర్: చేతన (మైక్రోబయాలజీ)
పరిశోధన అంశం: ప్రొడెక్షన్ ఆఫ్ పెక్టెనసిస్ ఫ్రం ఆస్పర్ గిల్లాస్ నిజర్ ఫర్ ఫ్రూట్ జ్యూస్ క్లారిఫికేషన్ రైపింగ్ అండ్ పీలింగ్ డీగ్రేడేషన్

స్కాలర్: సంజీవ్‌కుమార్ (మైక్రోబయాలజీ)
పరిశోధన అంశం: ఫార్మలేషన్ అండ్ ఎలివేషన్ ఆఫ్ పాలీబయోన్యూక్లోప్లాంట్ అన్ సెలెక్టెడ్ క్రాప్ ప్లాంట్స్

స్కాలర్: కె.సంధ్య (కెమిస్ట్రీ)
పరిశోధన అంశం: ఎన్విరార్‌మెంటల్లీ బిగిన్స్ బయోసింథసిస్ అన్ పెల్లాడియం నానోపార్టికల్స్ ఆన్ ఇట్స్ యూస్ ఇన్ ఎన్విరాన్‌మెంటల్ రెమిడేషన్ ఆన్ బయోమెడికల్ అప్లికేషన్

స్కాలర్: డి.వెంకటేష్ (కెమిస్ట్రీ)
పరిశోధన అంశం: సింథసిస్ క్యారెక్టరైజేషన్ ఫొటో క్యాటలిటిక్ ఆరండ్ ఫోరోమెటిక్ సెన్సింగ్ స్టడీస్ ఆఫ్ జి-సీ3ఎన్4 సపోర్టెడ్ మెటల్ ఆక్సైడ్ నానోపార్టికల్స్

స్కాలర్: రుకియాభాను (కెమిస్ట్రీ)
పరిశోధన అంశం: గ్రీన్ సింథసిస్ ఆఫ్ గోల్డ్ పెల్లాడియం అన్ సిల్వర్ నానోపార్టికల్స్ యూజింగ్ ప్లాంట్ ఎక్స్‌ట్రాక్ట్ క్యారెక్టరైజేషన్ అండ్ అప్లికేషన్

స్కాలర్: టి.స్వాతి (కెమిస్ట్రీ)
పరిశోధన అంశం: ప్రిపరేషన్ స్ట్రక్చరల్ క్యారెక్టరైజేషన్ అండ్ అప్లికేషన్ ఆఫ్ ట్రాన్సినిట్ స్పీసెస్ ఆఫ్ డీమ్యాప్ అండ్ సింథసిస్ ఆన్ సమ్ ఇంపార్టెంట్ స్కాఫోల్డ్స్ బై ఎంప్లయింగ్ ఆక్వోయిస్ ఫేస్ క్నోవేంగిల్ కండేంషేషన్ అండ్ మాల్టీకాంపోనెంట్ రియాక్షన్

స్కాలర్: జి.విజయలక్ష్మీ (కెమిస్ట్రీ)
పరిశోధన అంశం: ఆక్వియాస్ ఫేస్ గ్రీన్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఎంప్లయింగ్ లివేస్ బేస్ అడెక్ట్ ఆఫ్ డీమ్యాప్ యాజ్ న్యూగ్రీన్ రీఏజెంట్స్ అన్ స్టీరియో స్పెసిఫిక్ సింథసిస్ ఆఫ్ మెడిసినల్లీ యాక్టిక్ 1,8-న్యాప్తిరిడైన్ డిప్రివేటివ్

స్కాలర్: ఎంఆర్.సంధ్యారాణి (బిజినెస్ మేనేజ్‌మెంట్)
పరిశోధన అంశం: ఏ స్టడీ ఆన్ ఇంపాక్ట్ ఆఫ్ మోటివేషన్ ఆన్ ఎంప్లయిస్ రీటెన్షన్ విత్ రిఫరెన్స్ టూ సెలెక్ట్ ఐటీ కంపెనీస్ ఇన్ హైదరాబాద్

స్కాలర్: రితిక బజాజ్ (కామర్స్)
పరిశోధన అంశం: పర్ఫామెన్స్ ఆఫ్ తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ బస్ డిపోట్స్ ఇన్ హైదరాబాద్

అందరి ప్రోత్సాహంతో..



ఫిజిక్స్ విభాగంలో వాటర్‌సాలబుల్ రీఏజెంట్స్ పై పరిశోధన పూర్తి చేశాం. దానికి పేటెంట్ కూడా వచ్చింది. పరిశోధన పూర్తి చేయడానికి మా గైడ్ చంద్రకిరణ్‌తోపాటు అధికారులు అందరు ఎంతో సహకరించారు. పరిశోధన పూర్తి అయిన వెంటనే కాన్వకేషన్ నిర్వహించి డాక్టరేట్లు అందించడం చాలా సంతోషంగా ఉంది.

– స్వాతి, పీహెచ్‌డీ గ్రహీత

సంతోషంగా ఉంది



పండ్ల తొక్కలు డీగ్రేషన్ చేయడం, పొల్యూషన్ ఉండకుండా ఉండే విధంగా, ఫ్రూట్‌జ్యూస్ కు సంబంధించి క్లాసిఫికేషన్ పై పరిశోధన చేశాం. అందుకోసం గైడ్ టీచర్ మధుసూదన్‌రెడ్డి ఇతర అధికారులు ఎంతో సహకరించారు. అందుకు ప్రతి ఫలంగా కాన్వకేషన్‌లో డాక్టరేట్ అందుకుంటున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. భవిష్యత్తు పరిశోధనలు సమాజానికి ఉపయోగపడే విధంగా కృషి చేస్తాం.

– ఎ.చేతన, పీహెచ్‌డీ గ్రహీత

పరిశోధనలకు పేటెంట్ వచ్చింది



ప్రస్తుతం కాన్వకేషన్‌లో ఇద్దరు మా స్కాలర్స్ డాక్టరేట్ తీసుకుంటున్నారు. సమాజ హితం కోసం తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తి వచ్చే అంశాలపై పరిశోధనలు చేశాం. అందుకోసం పేటెంట్లు సైతం వచ్చాయి. భవిష్యత్ ప్రయోగాలు కూడా ప్రజలకు ఉపయోగ పడే విధంగా నిర్వహిస్తాం.

– ఎస్.చంద్రకిరణ్, ప్రొఫెసర్, ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్

సమాజహితం కోసమే..



పీయూలో ఇటీవల వివిధ డిపార్ట్‌మెంట్ల నుంచి ఎక్కువ సంఖ్యలో రీసెర్చ్ స్కాలర్స్ రావడం గొప్ప విషయం. ఇద్దరు స్కాలర్స్ మా ఆధ్వర్యంలో రీసెర్చ్ పూర్తి చేశారు. వారి పరిశోధనలు పూర్తిగా సమాజం, ప్రజల అవసరాలను తీర్చే విధంగా జరిగాయి. వారికి కాన్వకేషన్‌లో డాక్టరేట్‌లను ప్రదానం చేయడం గొప్ప విషయం.

– మధుసూదన్‌రెడ్డి, మైక్రోబయాలజీ విభాగం

ఫొటోల అప్‌లోడ్‌తో ఇందిరమ్మ బిల్లు

- యాప్‌లో అందుబాటులోకి కొత్త ఆప్షన్
- నేరుగా లబ్ధిదారులే ఎంట్రీ చేసే అవకాశం
- ప్రతిపాదనలో జాప్యానికి తప్పనున్న తిప్పలు



అడ్డాకుల మండలంలోని తిమ్మాయిపల్లిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో వివరాల నమోదుకు యాప్‌లో కొత్త ఆప్షన్ అందుబాటులోకి తీసుకొచ్చింది. బిల్లుల ప్రతిపాదలనలో జాప్యం నివారణ, ఇబ్బందులు దూరం చేసేందుకు గాను ఫొటోలు అప్‌లోడ్ చేసే అవకాశం నేరుగా లబ్ధిదారులకే కల్పించింది. గతంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మొదలైనప్పటి నుంచి వివిధ దశల ఫొటోలు తీసి పంచాయతీ కార్యదర్శులు, గృహ నిర్మాణ శాఖ అధికారులు యాప్‌లో అప్‌లోడ్ చేసేవారు. అవి గృహ నిర్మాణ శాఖ ఏఈ లాగిన్‌కు ఆ తర్వాత డీఈ, పీడీ, కలెక్టర్‌కు చేరేవి. పునాది పూర్తయితే రూ.లక్ష, స్లాబ్ లెవల్ (గోడలు) వరకు పూర్తయితే మరో రూ.లక్ష, స్లాబ్ పూర్తయితే రూ.2 లక్షలు, రంగులతో సహా ఇంటి నిర్మాణం మొత్తం పూర్తయ్యాక రూ.లక్ష ఇలా విడతల వారిగా మొత్తం రూ.5 లక్షలు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయి. అయితే పంచాయతీ కార్యదర్శులు ఈ ప్రక్రియ చేపట్టడంలో కొంత ఆలస్యం చేయడం, దీంతో లబ్ధిదారులు బిల్లుల కోసం ఎదురు చూసే పరిస్థితులు తలెత్తేవి. ఈ జాప్యాన్ని నివారించేందుకు గాను ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన ఫొటోలు అప్‌లోడ్ చేసేందుకు నూతన యాప్‌ను తీసుకొచ్చింది.

నమోదు ఇలా..

లబ్ధిదారులు స్మార్ట్ ఫోన్ (ఇంట్లో ఎవరిదైనా)లో ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. బెనిఫిషియర్ లాగిన్‌కు వెళ్లి.. పేరు, ఫక్షన్ నంబర్, గ్రామ వివరాలు నమోదు చేయాలి. ఇంటి నిర్మాణ ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. నిర్మాణ దశలకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానమిస్తే ప్రక్రియ పూర్తి అవుతుంది. ఈ ప్రక్రియను జిల్లాలోని చాలామంది లబ్ధిదారులు ఉపయోగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సద్వియోగం చేసుకోవాలి..

ఇందిరమ్మ లబ్ధిదారులు స్వయంగా ఫొటో అప్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి. ఎప్పటికప్పుడు ఫొటోలు అప్‌లోడ్ చేస్తే పరిశీలన తర్వాత బిల్లులు వారి ఖాతాలో జమ అవుతాయి. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ అవకాశం కల్పించింది.

– వైద్యం భాస్కర్, గృహ నిర్మాణ శాఖ పీడీ

స్నాతకోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: స్నాతకోత్సవానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని పీయూ వీసీ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పీయూ అడ్మినిస్ట్రేషన్ భవనంలో వివిధ కమిటీల చైర్మన్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్నాతకోత్సవ కార్యక్రమానికి వచ్చే అతిథులు, అధికారులు వాహనాలు నిలిపేందుకు ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేయాలని, భోజనాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, మెడల్స్ స్పాన్సర్ కోసం అన్ని వసతులు కల్పించాలన్నారు. మీడియా వారికి అనుగుణంగా కార్యక్రమం నిర్వహించే హాల్‌తోపాటు పలు ప్రదేశాల్లో ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాటు చేసి వారికి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, హాస్పిటాలిటీ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, మీడియా కమిటీ చైర్మన్ కుమారస్వామి, ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రవీణ, అధ్యాపకులు మాలవి, అర్జున్‌కుమార్, భూమయ్య, శ్రీధర్‌రెడ్డి, జిమ్మీకార్టర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రేమ విఫలమైందని.. యువకుడి ఆత్మహత్య


రామకృష్ణ(ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రేమ విఫలమై మనస్తాపానికి గురై ఇంట్లో ఉరివేసుకుని యువకుడు మృతిచెందిన ఘటన జిల్లా కేంద్రంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకోగా ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై గోవర్ధన్ కథనం ప్రకారం.. కొల్లాపూర్ పట్టణానికి చెందిన కొమ్ము రామకృష్ణ (25) జిల్లాకేంద్రంలోని మంతటి చౌరస్తా వద్ద బైక్ మెకానిక్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడు ఏడాది కాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఇంట్లో విషయం తెలియడంతో తల్లిదండ్రులు కొమ్ము రామకృష్ణను మందలించారు. ప్రేమించిన యువతి తనకు దక్కదని మనస్తాపానికి గురై క్షణికావేశంలో రాఘవేంద్రకాలనీలోని తన బాబాయి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఘటనకు సంబంధించి మృతుడి అన్న సలేశ్వరం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నీటిగుంతలోకి దూకి యువకుడు ఆత్మహత్య


రమేశ్(ఫైల్)

జడ్చర్ల: నీటి గుంతలో దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం మండలంలోని కొండేడులో చోటుచేసుకుంది. కొండేడు గ్రామ శివారులో గ్రామాభివృద్ధి కోసం భారీగా మట్టిని తీయడంతో అక్కడ ఓ గుంత ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గుంతలో భారీగా నీరు నిలించింది. గ్రామానికి చెందిన రమేశ్(25) అక్కడకు చేరుకుని ఆకస్మికంగా అందులోకి దూకి మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం అక్కడకు చేరుకుని నీటి గుంతలో గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య కొన్నాళ్ల కిందటే భర్తను విడిచి వెళ్లిందని, మృతుడికి తల్లి చిలకమ్మ, తమ్ముడు సురేశ్ ఉన్నారు. మద్యం మత్తులో నీటిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని గ్రామస్తులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

చోరీకి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

తెలకపల్లి: పంక్షన్ హాలులో చోరీకి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ నరేశ్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలో ఓ పంక్షన్ హాలులో ఈనెల 7న గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పంక్షన్ హాలులో ఉన్న ఐదున్నర క్వింటాళ్ల ఇనుము, జేసీబీకి సంబంధించిన సామగ్రి చోరీకి గురైనట్లు ఎస్ఐ తెలిపారు. బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. నిందుతుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. బాధితుడికి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


రాములు (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని గు డిపల్లి శివారులో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ గోవర్ధన్ కథనం ప్రకారం.. మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన మైనగాని రాములు (37) తన భార్య మానసతో కలిసి జిల్లా కేంద్రంలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఇతడు ప్లంబర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 9న తన బంధువుల వివాహం ఉండడంతో గుడపల్లికి వెళ్లారు. శనివారం అర్ధరాత్రి గుడిపల్లి శివారులో మైనగాని రాములు అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ అశోక్‌రెడ్డి, ఎస్ఐ గోవర్ధన్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రికి తలించారు. మృతుడు మైనగాని రాములు భార్య మానసకు పెద్దముద్దునూరుకు చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందని, ఇరువురు కలిసి హత్య చేసి ఉంటారని, మృతిపై అనుమానం ఉందని పోలీసులకు మృతుడి తండ్రి మైనగాని పాండయ్య ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలింత మృతిపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: బాలింత మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. బిజినేపల్లి మండలం లట్టుపల్లికి చెందిన రాత్లావత్ కవిత (26) ఈనెల 10న కాన్పు కోసం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో చేరింది. కాన్పు అనంతరం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి రెఫర్ చేయడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతిచెందింది. ఘటనకు సంబంధించి మృతురాలి తల్లి రాత్లావత్ తులసి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.









వికసించిన అరుదైన పుష్పాలు

జడ్చర్లలోని బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రాంగణంలో ఉన్న తెలంగాణ బొటానికల్ గార్డెన్‌లో అరుదైన మొక్కలకు పూ లు పూసా యి. దేశంలోని వివిధ ప్రాంతాల అడవుల నుంచి తీసు కొచ్చి నాటిన మొక్కలకు కాలానుగుణంగా పుష్పాలు వికసిస్తున్నా యని గార్డెన్ సమన్వయకర్త డా. సదాశివయ్య తెలిపారు. ఆర్కిడ్ జాతులైన హబీనేరియా, ఫర్సిఫెర, హబీనేరియా డిజిటేట, జియో దోరం, డెన్సిఫ్లోరం జియోదోరం, లా క్సిఫ్లోరం, యూలోఫియా గ్రమీనియా, లూసి యా జైలానిక, వాండ టెస్సేసియా మొక్కలకు ఇప్పటికే పూలు కాసాయని.. తెల్ల కలువ, హెటిరోస్టైమ అనే తీగజాతి మొక్క సైతం పుష్పించిందన్నారు. విద్యార్థులు పాఠ్యాంశాల్లో మా త్రమే చూసే మొక్కలు, పూలు ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పించినట్లయిందని ప్రిన్సిపాల్ డా. సుకన్య, వృక్షశాస్త్ర విభాగాధిపతి డా. నర్మద చెప్పారు.

– జడ్చర్ల టౌన్



నెట్‌బాల్ విజేత పాలమూరు

- ట్రెడిషనల్, ఫాస్ట్–5లో జిల్లా బాలుర జట్ల హవా
- రెండు విభాగాల్లో విజేతగా నిలిచిన జట్టు
- రన్నరప్‌లో నారాయణపేట బాలుర జట్టు
- ముగిసిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ చాంపియన్స్ ట్రోఫీ
- ట్రోఫీలు అందజేసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


ట్రెడిషనల్‌లో బాలుర విన్నర్ మహబూబ్‌నగర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎస్‌పీ.వెంకటేశ్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో రాష్ట్రస్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో ఆతిథ్య పాలమూరు జట్టు అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. ట్రెడిషనల్, ఫాస్ట్–5 విభాగాల్లో జిల్లా బాలుర జట్టు రెండు విభాగాల్లో చాంపియన్‌గా నిలవడం విశేషం. శనివారం రాత్రి ట్రెడిషనల్ విభాగంలో బాలుర మహబూబ్‌నగర్–నారాయణపేట జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. మహబూబ్‌నగర్ జట్టు 13–7 పాయింట్ల తేడాతో నారాయణపేట జట్టుపై విజయం సాధించింది. బాలికల విభాగం ఫైనల్ మ్యాచ్‌లో రంగారెడ్డి జట్టు 18–10 పాయింట్ల తేడాతో నల్గొండపై గెలుపొందింది.

ఫాస్ట్–5లో మహబూబ్‌నగర్‌దే విజయం

ఆదివారం జరిగిన ఫాస్ట్–5 బాలుర విభాగం మహబూబ్‌నగర్–నారాయణపేట జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. చివరకు మహబూబ్‌నగర్ జట్టు 16–15 పాయింట్ల తేడాతో నారాయణపేట జట్టుపై గెలుపొందింది. బాలికల ఫైనల్ మ్యాచ్‌లో మేడ్చల్ జట్టు 21–13 పాయింట్ల తేడాతో నల్గొండపై విజయం సాధించింది. బాలుర విభాగం మూడో స్థానంలో నల్గొండ, ఖమ్మం జట్లు, బాలికల విభాగం మూడో స్థానంలో మహబూబ్‌నగర్ జట్లు నిలిచాయి.

మిక్స్‌డ్ పోటీల ఫలితాలు

మొదటిసారిగా నిర్వహించిన రాష్ట్రస్థాయి మిక్స్‌డ్ విభాగం ఫైనల్ మ్యాచ్‌లో రంగారెడ్డి జట్టు (బాల, బాలికల) 13–8 పాయింట్ల తేడాతో ఖమ్మం జట్టుపై విజయం సాధించింది. మూడో స్థానంలో మహబూబ్‌నగర్, కరీంనగర్ జట్లు సంయుక్తంగా నిలిచాయి. నాలుగు రోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ నెట్‌బాల్ చాంపియన్ షిప్ ఆదివారం అట్టహాసంగా ముగిశాయి.

ట్రోఫీలు అందజేసిన ఎమ్మెల్యే యెన్నం

రాష్ట్రస్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన విన్నర్, రన్నరప్, మూడో స్థానం జట్లకు ట్రోఫీలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగపరచడమే కాకుండా ఆత్మవిశ్వాసం, నాయకత్వం, పట్టుదల, లక్ష్యాలను సాధించాలనే సంకల్పాన్ని నేర్పుతుందన్నారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్‌పీ వెంకటేశ్ జిల్లా కేంద్రంలో నాలుగు రోజులపాటు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఓడిన వారు నిరాశ చెందకుండా మళ్లీ గెలుపు కోసం శ్రమించాలని కోరారు. అంతర్జాతీయ నెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న రాష్ట్ర క్రీడాకారిణులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, నెట్‌బాల్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షుడు విక్రమాదిత్యరెడ్డి, కార్యదర్శి శిరీషరాణి, రామ్మోహన్‌గౌడ్, అంజద్‌అలీ, విహారి, షరీఫ్, మాజీ కౌన్సిలర్ షేక్ ఉమర్‌తోపాటు వివిధ జిల్లాల జట్ల కోచ్‌లు, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులపై వీధికుక్కల దాడి



కుక్కల దాడిలో గాయపడిన చిన్నారులు

ఊట్కూరు: తమ ఇండ్ల ముందర ఆడుకుంటున్న చిన్నారులపై వీధి కుక్కలు దాడిచేసి గాయపర్చిన ఘటన ఆదివారం ఊట్కూర్‌లో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కాలనీలో తమ ఇండ్ల ముందు ఆడుకుంటున్న అద్విత్, రాకేశ్, రవి తదితర చిన్నారులపై ఊరుకుక్కలు దాడి చేసి గాయపర్చాయి. దీంతో వారి తల్లిదండ్రులు స్పందించి నారాయణపేట ఆస్పత్రిలో చికిత్స చేయించారు. గతంలో పశువులు, మేకలపై కుక్కలు దాడులు చేశాయని తెలిపారు. నెలరోజుల క్రితం గ్రామపంచాయతీ సమీపంలో వానరంపై కుక్కలు మూకుమ్మడిగా దాడి చెయడంతో వానరం మృతిచెందిందని వాపోయారు. గతకొన్ని రోజులుగా గ్రామంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కుక్కలను తరలించాలని కోరుతున్నారు.

చారకొండ: ఆరుబయట ఆడుకుంటున్న బాలుడిపై వీధి కుక్కలు దాడి చేశాయి. కుక్కల దాడికి గురైన బాలుడు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన చారకొండ మండలం అగ్రహారంతండాలో చోటుచేసుకుంది. అగ్రహారం తండాకు చెందిన ఎనిమిదేళ్ల నేనావత్ వర్షిత్ ఆదివారం సాయంత్రం ఇంటి పక్కన వీధిలో చిన్నారులతో ఆడుకుంటుండగా అక్కడే ఉన్న వీధి కుక్కలు బాలుడిని వెంబడించి దాడి చేశాయి. ఈ ఘటనలో బాలుడి కాళ్లు, చేతులు, కడుపు, తలకు కుక్కకాట్లు పడి తీవ్ర గాయాలయ్యాయి. చారకొండలోని ప్రైవేట్ ఆస్పత్రితో చికిత్స పొంది, పరిస్థితి విషమంగా ఉండడంతో కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. అగ్రహారం తండాలో వీధికుక్కల స్వైర విహారం ఎక్కువైందని, రాత్రిళ్లు భయాందోళనలో ఉంటున్నారని, సంబంధిత పంచాయతీ అధికారులు తక్షణమే వీధికుక్కల బెడదను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

జడ్చర్ల టౌన్: జడ్చర్ల–నాగర్‌కర్నూలు ప్రధాన రోడ్డుపై నాగసాల సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో తిమ్మాజిపేట మండలం ఇప్పలపల్లికి చెందిన బంగారి (28) అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటో బైక్ ఢీకొన్న ఘటనలో బైక్‌పై ఉన్న బంగారి మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి తల్లిదండ్రులు మల్లయ్య, వెంకటమ్మతో పాటు సోదరుడు రాజు ఉన్నాడు.

శ్రీశైలానికి స్వల్పంగా వరద


విద్యుత్ కాంతులతో శ్రీశైలం ఆనకట్ట

దోమలపెంట: శ్రీశైలం ప్రాజెక్టుకు స్వల్పంగా వరద కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో ఆదివారం తెరిచి ఉన్న ఒక్క గేటును రాత్రి అధికారులు మూసివేశారు. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 45,587, సుంకేసుల నుంచి 8,892 మొత్తం 54,479 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వస్తుంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 27,142 మొత్తం 62,457 క్యూసెక్కుల నీళ్లు అదనంగా సాగర్‌కు విడుదలవుతున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 884.6 అడుగుల వద్ద 213.4011 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 5,000, హెచ్‌ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,835 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 17.264 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 15.398 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

రెండు గేట్ల ద్వారా నీటి విడుదల

రాజోళి: సుంకేసుల డ్యాం రెండు గేట్లను తెరిచి నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఆదివారం జేఈ మహేంద్ర తెలిపారు. ఎగువ నుంచి 15,250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. రెండు గేట్లను ఒక మీటర్ మేర తెరిచి 11,156 క్యూసెక్కులు విడుదల చేశారు. కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు విడుదల చేసినట్లు జేఈ పేర్కొన్నారు.

కోయిల్‌సాగర్ గేట్ల మూసివేత

దేవరకద్ర: ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో కోయిల్‌సాగర్ ప్రాజెక్టు గేట్లను మూసివేశారు. పెద్దవాగు ఇన్‌ఫ్లో తగ్గడంతో ఆదివారం ఉదయం ఒక్క గేటును తెరవగా మధ్యాహ్నం నుంచి ఆ గేటును మూసివేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 32.6 అడుగులు కాగా ప్రస్తుతం 32.4 అడుగులుగా ఉంది.

జూరాల గేట్ల మూసివేత

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గడంతో తెరిచి ఉంచిన గేట్లను మూసివేసినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం రాత్రి 9 గంటల వరకు ప్రాజెక్టుకు 62వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఆదివారం రాత్రి 9.30 గంటల వరకు ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో 55 వేల క్యూసెక్కులకు తగ్గిందన్నారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో ఆరు యూనిట్లను కొనసాగించి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 45,527 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 71 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 600 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 47,228 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 9.255 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

811.700 ఎంయూ విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ కర్ణాటక రాష్ట్రం నుంచి వరద భారీగా చేరుతుండడంతో దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుంది. ఆదివారం 12 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల ద్వార 234 మెగావాట్లు, 412.937 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 398.763 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 811.700 ఎంయూ విజయవంతంగా విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు తెలిపారు. ఉత్పత్తికి గానూ 45,587 వేల క్యూసెక్కుల నీటిని వినియోగించినట్లు పేర్కొన్నారు.

యూరియా తిని 12 మేకలు మృతి

నవాబుపేట: పొలంలో మేతలు మేస్తున్న మేకలు అక్కడున్న యూరియాను తినడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. మండలంలోని అమ్మాపూర్‌కు చెందిన మంగళి ప్రభాకర్‌కు చెందిన మేకలను ఎప్పటి మాదిరిగా ఆదివారం మేతకు తీసుకెళ్లాడు. కాగా గ్రామ సమీపంలోని పొలంలో మంగళి మాసయ్య పొలంలో మొక్కజొన్న మేత మేస్తుండగా పక్కనే ఉన్న సొప్పగూళ్లో ఉంచిన కొంత యూరియాను మేకలు తినేశాయి. దీంతో కొద్దిసేపట్లోనే మేకలు కిందపడి మృతిచెందాయి. 20మేకలను తీసుకెళ్తే 12మేకలు మాత్రం యూరియా తిన్నాయి. మిగతా మేకలు వేరేచోట మేత మేస్తున్నాయి. మేకలు ఒక్కొక్కటిగా కిందపడి మృతిచెందడంతో రైతు బోరున విలపించి గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు వచ్చేసరికే అక్కడ యూరియా తిన్న 12మేలు మృతిచెందాయి. కాగా మృతిచెందిన మేకల విలువ దాదాపు రూ.2లక్షలకు పైగానే ఉంటుందని రైతు వాపోయాడు. ఈ విషయంలో మేకలతో ఉపాధి పొంది జీవిస్తున్న మంగళి ప్రభాకర్ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


అమ్మాపూర్‌లో యూరియా తిని మృతిచెందిన మేకలు

చీరాల బీచ్‌లో జడ్చర్ల విద్యార్థి దుర్మరణం


బాదం సాయి మణిదీప్(ఫైల్)

జడ్చర్ల: ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతిలో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జడ్చర్లకు చెందిన ఓ విద్యార్థి ఆదివారం సెలవు రోజున ఆటవిడుపు కోసం మిత్రులతో కలిసి సముద్ర తీరాలకు వెళ్లి సముద్రం అలలలో కొట్టుకుపోయి నీట మునిగి మృతిచెందాడు. బంధువుల కథనం మేరకు.. జడ్చర్ల గంజ్ ప్రాంతానికి చెందిన బాదం సాయి మణిదీప్(20) ఏపీలోని అమరావతి వద్ద ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్య నభ్యసిస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో ఏడుగురు మిత్రులతో కలిసి ఆటవిడుపు కోసం చీరాల బీచ్‌కు వెళ్లారు. బీచ్‌లోని ససముద్రం అలలలో ఎనిమిది మంది విద్యార్థులు కొట్టుకుపోయారు. వీరిలో ముగ్గురు విద్యార్థులను కాపాడగా.. ఐదుగురు విద్యార్థులు నీటిలో గల్లంతయ్యారు. గల్లంతైన ముగ్గురు మృతదేహాలను బయటకు తీశారు. వీరిలో జడ్చర్లకు చెందిన విద్యార్థి సాయి మణిదీప్ ఉండడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుమారుడి మరణవార్త తెలియడంతో తల్లిదండ్రులు బాదం రాఘవేందర్, కల్యాణి ఒక్కసారిగా దిగ్ర్భాంతికి గురయ్యారు. కన్నీరు మున్నీరై విలపించారు. విషయం తెలిసిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి విద్యార్థి మృతిపై ఆరా తీసి విచారం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని త్వరితగతిన జడ్చర్లకు తీసుకొచ్చే విధంగా సహాయ చర్యలను ముమ్మరం చేయాలని అక్కడి అధికారులకు విజ్ఞప్తి చేశారు.